క్లుప్తంగా

కాపులకు అండగా జగన్ ప్రభుత్వం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో కాపులకు అండగా ఉందని శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన నరహరశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును ఆయన కార్యాలయంలో కలిసి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా నరహరిశెట్టి శ్రీహరి ఉమ్మారెడ్డికి సత్కరించారు. అనంతరం ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు శ్రీహరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినంత మేలు మరి ఏ ప్రభుత్వంలోనూ జరగలేదన్నారు. రానున్న ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు కాపులకు కేటాయించి గౌరవించారని వివరించారు. తనకు పదవి రావటంలో కృషి చేసిన ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు.

ఆసిఫ్‌కు మద్దతు తెలిపిన ఏఐసీసీ సభ్యుడు ఖాజా మొయిద్దీన్



భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) సభ్యుడు, నగర కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాజా మొయిద్దీన్ మద్దతు తెలిపారు. విద్యాధరపురంలోని పార్టీ పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి ఆయన బుధవారం వచ్చి ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందించారు. ఖాజా మొయిద్దీన్ మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పట్ల తాను ఆకర్షితుడిని అయ్యానని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విజయానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ బాజీ షాహిద్, హుస్సేన్ షరీఫ్, ముత్యాల రాంబాబు, షేక్ ఖాజా, మెట్టు వెంకటరెడ్డి, షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి కాలనీలో పోలీసుల కవాతు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెస్ట్ ఏసీపీ మురళీకృష్ణ తెలిపారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీలో బుధవారం కేంద్ర అదనపు బలగాలు, విజయవాడ సిటీ పోలీసులు కవాతు నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో సాగిన కవాతులో కొత్తపేట సీఐ గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. సంఘ విద్రోహ శక్తులను నిర్మూలించే దిశగా, ప్రజలకు అవసరమైన ధైర్యాన్ని ఇచ్చి, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కాలనీలో కమ్యూనిటీ హాల్ నుంచి ప్రారంభమైన కవాతు అన్ని ప్రధాన వీధులలో సాగింది.

చందన అలంకరణలో మారెమ్మ అమ్మవారు



విస్సన్నపేట: మండల పరిధి పుత్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో వార్షిక తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. బుధవారం రెండో రోజున అమ్మవారిని చందన లేపనంతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రాత్రికి ప్రభ బండిపై అమ్మవారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ ఈఓ వై. సీతారామయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

306 మద్యం సీసాలు స్వాధీనం

నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. మండలంలోని దాములూరు సమీపంలో గల రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో బుధవారం నందిగామ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో మినీ వ్యాన్‌పై 306 మద్యం సీసాలను తీసుకువస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తనిఖీలలో ఎస్ఐ దుర్గామహేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్మయుద్ధం చేస్తున్న జగనన్నను గెలిపించండి

- వలస వ్యక్తి అసత్య హామీలను నమ్మకండి
- వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): సార్వత్రిక ఎన్నికల సంగ్రామంలో ధర్మయుద్ధం చేస్తున్న సీఎం వైఎస్ జగనన్నను మళ్లీ గెలిపించాలని, అధర్మ దుష్ట కూటమిని చిత్తుచిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య, కృష్ణ ఆధ్వర్యంలో విస్తృతంగా పర్యటించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంటరాగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం పేదలకు చేస్తున్న మేలును వివరించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సీఎం జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మునుపెన్నడూ లేని విధంగా ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి చేసుకుంటూ వస్తోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని, నగరంలో కళ్ల ముందు కనపడుతున్న అభివృద్ధిని గమనించి మళ్లీ జగనన్న ప్రభుత్వానికే పట్టం కట్టాలని కోరారు. తాను ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగిన స్థానికుడిని అని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత పదేళ్లుగా విజయవాడ పార్లమెంట్ సభ్యునిగా ఎందరికో మేలు చేసిన కేశినేని శ్రీనివాస్(నాని)ను కూడా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నగర మాజీ మేయర్ మల్లిక బేగంను కలిసి ఓట్లను అభ్యర్థించారు.

పేదల పక్షాన నిలిచే జగనన్న ప్రభుత్వాన్ని ఎన్నుకోండి

ప్రజలే జగన్..జగనే ప్రజలు అన్నట్లుగా ఐదేళ్ల పాటు సాగిన సీఎం వైఎస్ జగన్ ప్రజా ప్రభుత్వాన్ని మళ్లీ ఎన్నుకోవాలని, తద్వారా సంక్షేమం, అభివృద్ధి కొనసాగేలా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆసిఫ్ అన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టి మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. ఆయా వ్యవస్థల ద్వారా ప్రజల ముంగిటకే పాలనను సీఎం జగన్ సమర్థంగా అందించారని తెలిపారు. నాడు ప్రతిపక్ష నాయకుడిగా జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని, చంద్రబాబు తాను ఇచ్చిన 650 హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేని అసమర్థుడిగా ఫెయిల్ అయ్యాడని ఎద్దేవా చేశారు. ప్రజారంజక పాలన కొనసాగింపునకు మరో సారి ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

వలస వ్యక్తి అసత్య హామీలను నమ్మకండి

దేశంలో పలు బ్యాంకులను మోసగించి కోట్లాది రూపాయలను ఎగ్గొట్టిన వైట్ కాలర్ ఆర్థిక నేరగాడు సుజనా చౌదరి అని ఆసిఫ్ అన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థనే మోసం చేసిన వ్యక్తి ఇక్కడ ప్రజల్ని మోసం చెయ్యడని గ్యారంటీ ఏమిటని అన్నారు. సుజనా చౌదరి ఇచ్చే అసత్య హామీలను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. నియోజకవర్గం ఎల్లలు, స్థితిగతులు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా ఊడిపడి ఏదేదో చేసేస్తానని చెప్పి మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని, వాటిని తిప్పికొట్టి ఎక్కడ నుంచి వచ్చాడో అక్కడికే తరిమికొట్టాలని పిలుపిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు దుర్గారావు, తోలేటి శ్రీకాంత్, సూరసాని రామిరెడ్డి, బట్టిపాటి శివ, ముత్యాల రాంబాబు, ముత్తా వాసు, బోర మల్లేశ్వరరెడ్డి, గుండు లక్ష్మి, సుంకర నారాయణ, మద్దిల రామకృష్ణ, మండల శ్రీనివాస్, మాదల తిరుపతిరావు, గురవయ్య, డి.రాము, లింగయ్య, రాళ్లపల్లి లక్ష్మి, కె.భాను, సల్మా సుల్తానా, నాగపావని, స్రవంతి, నన్నం దుర్గ, దేవర సురేష్, దావాల బుజ్జి, ఏలూరు కిరణ్, సీహెచ్ లక్ష్మణ్, కె.శ్రీను, జీఎంసీ అల్తాఫ్, ఎస్కే జిలానీ, కె.రోశిరెడ్డి, ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో భాగంగా మహిళకు అభివాదం చేస్తున్న ఆసిఫ్, పక్కన పార్టీ శ్రేణులు



నగర మాజీ మేయర్ మల్లిక బేగంతో ఆసిఫ్

మైనార్టీలకు జగనన్న ప్రభుత్వంలోనే ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్



ఆసిఫ్, జీఎంసీ బాషాలను పూలదండలతో సత్కరిస్తున్న రఫీ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం లభించిందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ అన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన జీఎంసీ బాషాను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. జీఎంసీ బాషా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఆసిఫ్‌కు ధన్యవాదాలు తెలుపుతూ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెలంపల్లి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పశ్చిమంలో ఆసిఫ్ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా భవానీపురం లారీ సప్లయిర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు షేక్ రఫీ, సెక్రటరీ బొమ్ము మధు, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొని ఆసిఫ్, జీఎంసీ బాషాలను శాలువా, పూలదండలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితులైన షేక్ మహమ్మద్ వాహెద్ విద్యాధరపురంలోని పశ్చిమ ఎన్నికల ప్రధాన కార్యాలయానికి వచ్చి ఆసిఫ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసిఫ్ ఆయన్ను అభినందించి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ బాజీ షాహిద్, సత్తార్, ఎస్కే జాఫర్, షేక్ ఖాజా, షేక్ పాషా పాల్గొన్నారు.

వై నాట్ 175 దిశగా దూసుకువెళ్లాలి

రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి



వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అయోధ్య రామిరెడ్డి, ఆసిఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు, పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి బుధవారం విద్యాధరపురంలోని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆయనకు ఎదురేగి సాదరంగా ఆహ్వానించారు. తొలుత వారు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆసిఫ్‌తో కొద్దిసేపు ముచ్చటించారు. ఎన్నికల ప్రచారం ఎలా సాగుతుంది, ప్రజల స్పందన ఎలా ఉంది అడిగి తెలుసుకున్నారు. మేమంతా సిద్ధం బస్ యాత్ర చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండుటెండల్లో పడుతున్న కష్టాన్ని స్ఫూర్తిగా తీసుకుని అభ్యర్థులు ముందుకు సాగాలని సూచించారు. పక్కా ప్రణాళికను రూపొందించుకుని ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు వై నాట్ 175 దిశగా దూసుకువెళ్లాలని దిశానిర్దేశం చేశారు. పశ్చిమ నియోజకవర్గంలో ఇప్పటికి రెండు సార్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థులు గెలిచారని, ఈసారి కూడా విజయం సాధించి హ్యాట్రిక్ కొడతారన్న నమ్మకం ఉందంటూ ఆసిఫ్ భుజం తట్టారు. కేశినేని శ్రీనివాస్(నాని)కూడా విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా హ్యాట్రిక్ కొడతారన్న ధీమా వ్యక్తం చేశారు.

పశ్చిమలో రూ.కోట్లతో అభివృద్ధి

- మే 13 తరువాత సుజనాచౌదరి మూటాముల్లేతో ఢిల్లీకే
- పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆసిఫ్

పూర్ణానందంపేట(విజయవాడ పశ్చిమ): కోట్లాది రూపాయలు వెచ్చించి పశ్చిమ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీదేనని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం 56వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ యలకల చలపతిరావుతో కలిసి ఆయన పర్యటించారు. పాత ఆర్ఆర్ పేట మహంకాళి అమ్మవారి గుడి వీధిలో పర్యటించిన ఆయన గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ పథకాల ద్వారా కోట్లాదిమంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు, పశ్చిమ నియోజకవర్గంలో ఎన్నడూ జరగనన్ని అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. పాత ఆర్ఆర్‌పేటలో కొత్త పైపు లైన్‌లను ఏర్పాటు చేసి తాగు నీటి సమస్యను పరిష్కరించామన్నారు. డివిజన్‌లో ప్రతి వీధికి సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ వరుసగా రెండు సార్లు విజయ ఢంకా మోగించిన పశ్చిమలో మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. నియోజక వర్గంలోని ప్రజలందరూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కులాలు, మతాలను విడగొట్టి చేసే రాజకీయాలు పశ్చిమ నియోజకవర్గంలో చెల్లవన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఏ సమస్య ఉందో తెలియని ఢిల్లీ బాబును ఇక్కడ డంప్ చేసి గెలవాలనుకోవటం ప్రతిపక్ష పార్టీల అవివేకం అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రబ్బానీ, వాసా బాబు, గొలగాని శ్రీను, సుబ్బు, స్రవంతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలను గురించి వివరిస్తున్న ఆసిఫ్

పేదల భవిష్యత్ కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి

ఎంపీ కేశినేని నాని కుమార్తె శ్వేత

భవానీపురం(విజయవాడపశ్చిమ): పేదల బంగారు భవిష్యత్ కోసం ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని, తద్వారా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) కుమార్తె కేశినేని శ్వేత అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆమె 47వ డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, గోదావరి బాబు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో ఆమె డివిజన్‌లోని కేఎల్‌రావు నగర్ ప్రాంతంలో పర్యటించారు. తొలుత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిలో నిర్వహించిన ప్రార్థనల్లో పాల్గొని పాస్టర్ ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం కార్పొరేటర్ గోదావరి గంగ, స్థానిక పార్టీ శ్రేణులతో కలిసి గడప గడపకు తిరిగి స్థానికులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే సీఎం జగన్ లక్ష్యమని అన్నారు. పథకాలు అందని వారు నిరుత్సాహపడనవసరం లేదని, అర్హతకు సంబంధించిన పత్రాలతో మళ్లీ దరఖాస్తు చేసుకోవడం అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ పథకాలు ఇలానే కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటేనే సాధ్యమవుతుందని చెప్పారు.



47వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో కేశినేని శ్వేత, గోదావరి గంగ తదితరులు

ప్రతిపక్షాలకు ప్రజా ప్రయోజనాలు పట్టవు

జగనన్నను అధికార పీఠం నుంచి దింపాలన్నదే టీడీపీ, జనసేన, బీజేపీల దురాలోచన తప్ప వారికి ప్రజా ప్రయోజనాలు పట్టవని కేశినేని శ్వేత ఎద్దేవా చేశారు. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే జనాల దగ్గరకు వచ్చి కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేస్తున్నారని తెలిపారు. పేదరిక నిర్మూలన దిశగా పాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబుకు చెప్పుకునేందుకు ఒక్క స్కీమ్ కూడా లేదని, అతని జీవితమంతా స్కామ్‌ల మయం అని అన్నారు. సీటుకు కోట్ల రూపాయలు తీసుకుని చంద్రబాబు పోటీలో నిలబెట్టిన పెత్తందార్లు ఓటు కోసం ఇచ్చే డబ్బుకు ఆశపడి మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దేరంగుల వెంకట రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమిశెట్టి వెంకటేష్, కలిమెళ్ల కాశీ, పిళ్లా సూరిబాబు, మద్దిరాల కమలాకర్, రెడపంగు క్రాంతి, దిద్దుకూరి శివ, కత్తి జాషువా, నన్నం దుర్గ, ఇలిపిల్లి విజయలక్ష్మి పాల్గొన్నారు.

2027 నాటికి మలేరియా రహిత సమాజానికి కృషి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 2027 నాటికి మలేరియా రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ 25వ తేదీ వరల్డ్ మలేరియా డేను పురస్కరించుకుని జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు మాట్లాడుతూ మలేరియా వ్యాధి వచ్చిన తర్వాత కంటే ముందుగా నివారించడం మనందరి ప్రధాన లక్ష్యమన్నారు. 2027కి మలేరియా కేసులు లేకుండా చేసుకోవడంతో పాటు 2030 నాటికి మనదేశంలో మలేరియా కేసులు నిర్మూలించడమే లక్ష్యమన్నారు. మలేరియా నివారణ కోసం పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూడటంతో పాటు దోమల లార్వా వృద్ధి చెందకుండా నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. దోమల లార్వా నిర్మూలన కోసం పెద్ద ఎత్తున సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించడంతో పాటు శివారు ప్రాంతాల్లో నివసించే వారు దోమ తెరలు వాడుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో వెలగలేరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మాధురి, డాక్టర్ సుమ బజాజ్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సూర్యనాయక్, సబ్ యూనిట్ అధికారులు, మలేరియా సిబ్బంది, కార్పొరేషన్ సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు

ఘనంగా మరకత శివలింగ వాయు ప్రతిష్ట



మరకత శివలింగ వాయు ప్రతిష్టలో గౌతంరెడ్డి, కమిటీ పెద్దలు, భక్తులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. మందిర గౌరవాధ్యక్షుడు పూనూరు గౌతంరెడ్డి, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు విశేష సంఖ్యలో హాజరై రత్న ధాతు, ధాన్య యంత్ర సహిత శివలింగ ప్రతిష్టను కనులపండువగా నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే విచ్చేసి స్వామివారికి స్వయంగా అభిషేకాలు చేశారు. సాయంత్రం విశిష్ట అలంకరణ, అర్చనలు జరిగాయి. గౌతంరెడ్డి మాట్లాడుతూ లోక కల్యాణార్థం తలపెట్టిన మరకత శివలింగ వాయు ప్రతిష్ట మహోత్సవాలు కనులపండువగా జరిగాయని అన్నారు. ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేసి, స్వామివారి కృపకు పాత్రులైన భక్తులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దొంతిరెడ్డి లక్ష్మణరెడ్డి, ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, పి.శ్రీనివాసరావు, సైదులు, లఖంరాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రానున్న ఎన్నికల్లో ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ, కేబీఎన్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఓటు అవగాహనా ర్యాలీని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ కలిగిన దేశం భారతదేశమన్నారు. 144 కోట్ల జనాభా కలిగిన దేశంలో పెద్ద ఎత్తున ఎన్నికల ప్రక్రియను నిర్వహించి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రభుత్వాన్ని ఎన్నుకోవటం ఈ దేశం గొప్పతనమన్నారు. అటువంటి భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు పునాది వంటిదని చెప్పారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవటం ద్వారా ప్రజాస్వామ్యం మరింత బలోపేతమవుతుందన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ అధికారి, స్వీప్ నోడల్ ఆఫీసర్ యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నిర్లిప్తతను తొలగించి ఓటింగ్ శాతాన్ని పెంచడంలో విస్తృత ప్రజా భాగస్వామ్యం అవసరమన్నారు. పవిత్రమైన ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుకు సమస్త సమాచారంతో క్యూఆర్ కోడ్ ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్ (వీఐఎస్) అందిస్తారన్నారు. తొలుత ర్యాలీని కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు ప్రారంభించారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఎల్ఎన్ రెడ్డి, నగరపాలకసంస్థ అడిషనల్ కమిషనర్ కీర్తి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ సమరం, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కళాశాల కార్యదర్శి శ్రీనివాసు

బ్రాహ్మణ సంక్షేమానికి అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం కృషి

విజయవాడకల్చరల్: బ్రాహ్మణ సంక్షేమం కోసం అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం నిరంతరం కృషి చేస్తోందని ఆ సేవా సంఘం కార్యదర్శి తాళ్లూరి వెంకట దశరథ రమేష్ అన్నారు. సేవా సంఘం ఆధ్వర్యాన సత్యనారాయణపురం సీతారామ కల్యాణ మండపంలో బ్రాహ్మణ బాలురకు ఉచిత ఉపనయన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ సనాతన వైదిక ధర్మం, వేద సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. నిత్యానుస్థానం ద్వారా ధర్మ మార్గం అలవడుతుందని అన్నారు. సంస్థ అధ్యక్షుడు గురునాథశర్మ సంస్థ లక్ష్యాలను వివరించారు. ఉదయం బ్రహ్మీ ముహూర్తంలో ఉపనయన కార్యక్రమం వైభవంగా జరిగింది. బాచిప్ప నాగరాజు పర్యవేక్షించారు. కార్యక్రమంలో సేవా సంఘం కన్వీనర్లు యడ్లపాటి శేషసాయి, శిరీష, కోశాధికారి అనుమల రాంబాబు, సభ్యులు భమిడిపాటి గణపతి, కామర్స్ రాజేష్, ఈసీ సభ్యులు విజయలక్ష్మి, మాధవి, మూర్తి, కాశీభట్ల రవికుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు నిత్య అనుష్టానికి అవసరమైన పూజా సామాగ్రిని అందజేశారు. తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఉపనయన కార్యక్రమంలో వటువులు, నిర్వాహకులు

రచయిత తల్లాప్రగడ మృతికి సాంస్కృతిక సంస్థల సంతాపం



విజయవాడకల్చరల్: కవి, రచయిత, కాలమిస్ట్ తల్లాప్రగడ రవికుమార్ మృతికి నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఎక్స్‌రే సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ రవికుమార్ సుదీర్ఘకాలం ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ నిర్వహించిన అనేక కార్యక్రమాలు విజయవంతం కావడానికి కృషి చేసినట్లు తెలిపారు. సాహితీవేత్త సత్యశ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరమాల అనే స్వీయ కథా సంపుటిని వెలువరించారని, సినీ కవి వేటూరి సుందరరామమూర్తి కవితా సంపుటి 'సిరికాకొలను చిన్నది' అచ్చువేశాడని వెల్లడించారు. విజయవాడ ఆకాశవాణి కేంద్రంలో జరిగిన అనేక సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ తన సంతాప సందేశంలో రవికుమార్ మృతి సాహిత్య రంగానికి తీరనిలోటు అని అభివర్ణించారు. వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరచూరి విజయలక్ష్మి, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ అధ్యక్షుడు కొల్లూరి, విద్యావేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వెన్నా వల్లభరావు, డాక్టర్ జయంతి చక్రవర్తి, గోళ్ల నారాయణరావు సంతాపం తెలిపారు.





● తెప్పోత్సవం

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల తెప్పోత్సవం బుధవారం రాత్రి పవిత్ర కృష్ణానదిలో నయనానందకరంగా సాగింది. దుర్గాఘాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంస్‌పై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువు తీరగా అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామరావు దంపతులు, వైదిక కమిటీ సభ్యులు, వేద పండితులు పాల్గొన్నారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. –ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ)